## కాళోజీ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుల నియామకం

వరంగల్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నూతన పాలక మండలి సభ్యులను నియమించింది. ఈమేరకు ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది. ఈ పాలకమండలిలో ఏడుగురు సభ్యులు కాళోజీ యూనివర్సిటీ పరిపాలన పరమైన విషయాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. వీరి పదవీ కాలం మూడేళ్లు ఉంటుంది. పాలక మండలిలో మెడిసిన్ నుంచి నిమ్స్‌లోని రుమటాలజీ అండ్ డీన్, హెచ్‌వోడీ డాక్టర్ లీజా రాజశేఖర్, హైదరాబాద్‌లోని సన్‌షైన్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ గురువారెడ్డి, సికింద్రాబాద్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, అల్లోపతిక్ నుంచి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, యూనివర్సిటీ సంబంధిత కళాశాల నుంచి ఉస్మానియా మెడికల్ కళాశాల పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.రవికుమార్, ఉస్మానియా మెడికల్ కళాశాల, నీలోఫర్ హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి, మహబూబాబాద్ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్, డాక్టర్ జె.వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# రిజర్వేషన్ల అమలుకు బీసీలు గళమెత్తాలి

**ఉద్యమాలకు పెట్టింది పేరు వరంగల్.. ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నెరవేర్చాలి**

**ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి**

**అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటుపై ఏప్రిల్ 11లోగా సానుకూల ప్రకటన చేయాలి**

**హనుమకొండలో రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

నయీంనగర్, ఫిబ్రవరి 6 : ఉద్యమాలకు, పోరాటాలకు వరంగల్ పెట్టింది పేరు అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను అమలుచేసేలా బీసీ మేధావులు గళమెత్తాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన ప్రకారం ఆరు నెలల్లో కులగణన చేపట్టే ప్రక్రియను ప్రారంభించాలని ఆమె స్పష్టం చేశారు. ఆగమాగం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ వడ్డెపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీసీ హక్కుల సాధన కోసం భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

### రూ.20వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

బీహార్‌లో కులగణన చేసినా కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ కులగణన చేస్తామని హామీ ఇచ్చి చేయలేదని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా ముందడుగు వేయలేదని విమర్శించారు. బీసీల సంక్షేమం కోసం ఏటా రూ.20వేల కోట్లు బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, 2024–25 బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. అలాగే బీసీ సబ్‌ప్లాన్‌కి చట్టబద్ధత కల్పించాలని, ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జిల్లాగా నామకరణం చేయాలన్నారు. అలాగే అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని, దీనిపై ఏప్రిల్11లోపు ప్రభుత్వం సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ఆధారంగా రాష్ట్రాల్లో రిజర్వేషన్లు చేసుకోవచ్చని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రతిపాదించారని గుర్తుచేశారు. కానీ కేంద్రం మాత్రం సుప్రీం తీర్పును చూపి రాష్ట్రాలకు వెసులుబాటు కల్పించడం లేదని చెప్పారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి ఇప్పటివరకు 4365మంది సివిల్స్‌కు ఎంపికైతే అందులో కేవలం 1,195 మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని లేవనెత్తారు. ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు ఉన్నా కూడా కేవలం 15.5శాతం మందిని మాత్రమే ఎంపిక చేశారని చెప్పారు. ఎస్సీలు 5శాతం, ఎస్టీలు 3శాతం మాత్రమే ఎంపికయ్యారని వివరించారు.

### తెలంగాణ ఉద్యమం తరహా పోరాడాలి

హక్కుల కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉద్యమాలకు పెట్టింది పేరైన వరంగల్ తెలంగాణ ఉద్యమంలో ముందువరుసలో ఉందని గుర్తుచేశారు. భారత జాగృతిగా రూపాంతరం చెందిన తెలంగాణ జాగృతి అనేక సామాజిక అంశాలపై పోరాటాలు చేసిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడి బతుకమ్మకు రాష్ట్ర హోదా, నిరాహార దీక్ష చేసి అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం సాధించామని, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి దాదాపు 20వేల మంది యువతకు ఉద్యోగ కల్పనకు దారి చూపామని, దేశవ్యాప్తంగా మహిళా బిల్లుపై చర్చకు ప్రేరేపించామని కవిత వివరించారు. సమావేశంలో జాగృతి ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, కార్పొరేటర్ చెన్నం మధు, పులి రజనీకాంత్, బక్క నాగరాజు, మాధవి పాల్గొన్నారు.

### ప్రతి బీసీ ఇంట్లో పూలే ఫొటో ఉండాలి



ప్రతి బీసీ ఇంట్లో జ్యోతిరావు పూలే ఫొటో ఉండాలి. బీసీలకు చట్టసభల్లో రావాల్సినవి చాలా ఉన్నాయి. తెలంగాణ ఏర్పడక ముందు బీసీలను చిన్నచూపు చూసేవారు. కానీ కేసీఆర్ ఆనాడు ఉద్యమంలో ఉన్నప్పటి నుంచే ఏ కులానికీ అన్యాయం జరగొద్దని ఆలోచించి అన్ని కులాలకు సమన్యాయం చేశారు. బీసీల అభివృద్ధికి నిరంతరం కృషిచేశారు. బీసీల హక్కుల కోసం ఎమ్మెల్సీ కవిత ముందుకు రావడం చాలా సంతోషం.

– సుందర్‌రాజ్ యాదవ్, కుడా మాజీ చైర్మన్

### సమాజానికి బీసీలు వెన్నెముక



సమాజానికి బీసీలు వెన్నెముక లాంటివారు. అలాంటి బీసీలకు ఎంతో అన్యాయం జరుగుతోంది. 55శాతం బీసీలు ఉన్నా గణన చేయకపోవడం సరైనది కాదు. ఈ నెల 12న మహాధర్నా నిర్వహించబోతున్నాం. పార్టీలకతీతంగా అందరూ హాజరై విజయవంతం చేయాలి. బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనివ్వం. కాంగ్రెస్ హామీలను వెంటనే నెరవేర్చాలి.

– గట్టు రామచందర్‌రావు, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్

### రాజ్యాంగంలో అంబేద్కర్ ఆనాడే రాశారు



రిజర్వేషన్లు అమలు చేయాలని అంబేద్కర్ రాజ్యాంగంలో ఆనాడే రాశారు. 1929–30లోనే కులగణన చేయాలని జ్యోతిరావు, పూలే పోరాడారు. 1931లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రిజర్వేషన్ చేయడంతో బీసీలకు మాత్రం తీవ్ర అన్యాయం జరిగింది. చాలా శాఖల్లో ఓబీసీలకు అన్యాయం జరిగింది.

– వెంకట్‌రాజం, మేర కులస్తుడు

### రాజకీయాలకు అతీతంగా పోరాడాలి



ప్రతి ఒక్కరు భవిష్యత్ కోసం బీసీల కులగణన కోసం రాజకీయాలకు అతీతంగా పోరాడాలి. ఒకే మాట.. ఒకే బాటగా ఉండాలి. ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే లక్ష్యం సాధిస్తాం. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో బీసీలు ఎంతో లబ్ధిపొందారు. బీసీలపై ప్రత్యేక శ్రద్ధతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేయాలి.

– బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ

### బ్రాహ్మణుల కోసం పూలే కొట్లాడాడు



మహాత్మా జ్యోతిరావుపూలే బీసీల్లో పుట్టి, ఆనాడు ఉన్న పరిస్థితుల ప్రకాకరంబ్రాహ్మణులు, దళితుల కోసం కొట్లాడారు. లక్ష్యం కోసం పనిచేసే వాళ్లకు కులం అంటూ ఏమీ ఉండదు. చాలామంది మహనీయులు కూడా అదే పనిచేశారు. బీసీల కోసం చేసే ఉద్యమంలో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొనాలి. కేసీఆర్ దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు దళితబంధు ఏర్పాటు చేశారు. ఆశయాల కోసం వందలాది మంది మరణించిన గడ్డ తెలంగాణ గడ్డ. అణచివేయబడ్డ వారికి గుర్తింపు ఉండాలి. అన్ని వర్గాలను కలుపుకొని బీసీల కులగణన సాధించుకోవాలి.

–వి.ప్రకాశ్, టీడబ్ల్యూఆర్డీసీ మాజీ చైర్మన్



# కోత.. కొరత.. మోత..

**ఇసుక రీచ్‌లు మూత.. కృత్రిమ కొరత**

**నెలలోనే అమాంతం పెరిగిన ధర.. టన్నుకు రూ.500 నుంచి రూ.800దాకా పెంపు**

**ఆన్‌లైన్ బుకింగ్‌లో జాప్యం.. ఇదే అదునుగా దండుకుంటున్న వ్యాపారులు**

**ఇండ్లు కట్టుకోలేక లబోదిబోమంటున్న వినియోగదారులు**

నిన్నమొన్నటి వరకు అందుబాటులో ఉన్న ఇసుక ధర ఇప్పుడు అమాంతం పెరిగింది. నాణ్యమైన ఇసుక లభ్యమయ్యే క్వారీలను ప్రభుత్వం మూసివేసి రీచ్‌లను తగ్గించడంతో ఆన్‌లైన్ బుకింగ్‌లు జాప్యమవుతున్నాయి. ఇదే అదునుగా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ఇష్టారీతిన ధరలు పెంచడంతో వినియోగదారులపై భారం పడుతున్నది. డిసెంబర్ నుంచి జూన్ వరకు నిర్మాణాలకు సీజన్ కాగా ఈ కాలంలోనే అడ్డగోలుగా పెరిగిన ఇసుక ధరతో నిర్మాణదారుల వెన్నులో వణుకు పుడుతున్నది. అంత ధర పెట్టి కొనలేక నిర్మాణాలను అతికష్టంమీద పూర్తిచేయాల్సి వస్తున్నది.

–వరంగల్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / ములుగు/జయశంకర్ భూపాలపల్లి (నమస్తే తెలంగాణ)

నెల క్రితం వరకు సులభంగా అందుబాటు ధరలో లభించిన ఇసుక ఇప్పుడు రెండింతల రేటు పెరిగి వినియోగదారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. నాణ్యమైన ఇసుక లభించే రీచ్‌లను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బంద్ చేసింది. తక్కువ క్వారీలు ఉండడంతో డిమాండ్‌కు సరిపడా ఇసుక అందుబాటులో లేక ఆన్‌లైన్ బుకింగ్‌లో జాప్యమవుతున్నది. ఇదే అదునుగా వ్యాపారులు ఇసుక కృత్రిమ కొరత సృష్టించి రేటు రెండింతల నుంచి మూడింతలు పెంచి అమ్ముతున్నారు. ఒక్కసారిగా పెరిగిన ఇసుక ధరతో నిర్మాణదారులు గగ్గోలుపెడుతున్నారు. డిసెంబర్‌లో సన్న ఇసుక టన్ను ధర రూ.1000 నుంచి రూ.1100 ఉండేది. ఇప్పుడు ఏకంగా రూ.1500కు పెరిగింది. దొడ్డు ఇసుక ధర కూడా ఇలాగే ఉంది. రెండు నెలల క్రితం టన్ను రూ.950 ఉన్న దొడ్డు ఇసుక ఇప్పుడు రూ.1200కు పెరిగింది. నిర్మాణ రంగానికి ప్రస్తుత సీజన్ అనువైనది. డిసెంబర్ నుంచి జూన్ వరకు ఎక్కువ నిర్మాణాలు జరుగుతాయి. ఈ సీజన్‌లో ఇసుకకు సహజంగానే డిమాండ్ ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని ఇసుక రీచ్‌లను బందుపెట్టింది. డిమాండ్ ఎక్కువ ఉండే ఈ సమయంలోనే రీచ్‌లను బందు పెట్టడంతో సరిపడా ఇసుక సరఫరా కావడం లేదు. ఇండ్లు కట్టుకునే మధ్యతరగతి వర్గాలపై ఇసుక ధరల పెంపుతో మరింత భారం పడింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక రీచ్‌లు ఎక్కువ ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఆన్‌లైన్‌లో డీడీలు తీసిన వారికి ఇసుక సరఫరా అయ్యేది. ఇప్పుడు ఇసుక కోసం డీడీలు తీసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లారీల ఓనర్లు ముందుగా డీడీలు తీసి రీచ్‌ల వద్దకు వాహనాలను పంపుతారు. ఇసుక రీచ్‌లు తగ్గడంతో ఇప్పుడు ఆన్‌లైన్‌లో డీడీల లభ్యత తక్కువ ఉంటున్నది. రెండు నెలల క్రితం వరకు రోజూ ఒకటి చొప్పున లారీ లోడ్ తెచ్చుకునే వ్యాపారులకు ఇప్పుడు రెండుమూడు రోజులకుగానీ వంతు రావడంలేదు. దీని వల్ల ఇసుక సరఫరా తక్కువై ధరలు పెరుగుతున్నాయి.

### గతంలో 40వేల టన్నులు.. ఇప్పుడు 12వేలే..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఇసుక క్వారీల నుంచి రవాణా తగ్గిపోయింది. ప్రస్తుతం కాళేశ్వరం క్వారీల నుంచి రోజూ సుమారు 12 వేల టన్నుల ఇసుక రవాణా అవుతోంది. గతంలో రోజూ 30వేల నుంచి 40 వేల టన్నుల రవాణా జరిగేదని లారీ యజమానులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం రోజూ 400 బుకింగ్‌లు వస్తుంటే 350 లారీల ఇసుక వరంగల్, పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్‌కు తరలుతున్నది. గతంలో రోజూ 2వేల లారీలు 30వేల నుంచి 40 వేల టన్నుల ఇసుక రవాణా చేసేవని, ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయిందని లారీ యజమానులు చెబుతున్నారు. కాళేశ్వరం వద్ద పలుగుల 6, పలుగుల (గుండ్రాత్‌పల్లి), పలుగుల 5, పుస్కుపల్లి (బెగ్లూర్ 1), పలుగుల 10, పలుగుల 8, పుస్కుపల్లి (కొల్లూరు 1), పలుగుల 7 (మద్దులపల్లి) క్వారీలు నడుస్తున్నాయి.

6

మేడారం జాతర నేపథ్యంలో ఏటూరునాగారం వైపు ఇసుక క్వారీలను తాత్కాలికంగా మూసివేశారు. ప్రస్తుతం కాళేశ్వరం వద్ద గల 8 క్వారీల నుంచే ఇసుక రవాణా అవుతోంది. కాళేశ్వరం ఇసుక సాధారణ రకం టన్నుకు రూ.900 ఉండేదని ఇప్పుడు రూ.1200 నుంచి రూ.1400 వరకు పెరిగిందని, నాణ్యమైన ఇసుక రూ.1000 ఉంటే, ఇప్పుడు రూ.1500 నుంచి రూ.1800 వరకు పెరిగిందని వినియోగదారులు చెబుతున్నారు. కొందరు డంప్ చేస్తూ డిమాండ్‌ను బట్టి అధిక ధరకు విక్రయిస్తున్నారు.

### 11క్వారీలకు ఆరు బంద్

ములుగు జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతమైన మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాల పరిధిలో 11 క్వారీలు ఉండగా ఆరు క్వారీలు మూతపడ్డాయి. మంగపేట మండలం మల్లూరు, చుంచుపల్లిలో మూడు, వాజేడు మండలం అయ్యవారిపేట, ధర్మవరం, రాంపూర్‌లో మూడు, వెంకటాపురం(నూగూరు) మండలం మొర్రివానిగూడెం, శ్రీరంగపురం, కె. కొండపురం, వంటి చింతగూడెం గ్రామాల్లో నాలుగు క్వారీలుండగా ప్రస్తుతం వెంకటాపురం(నూగూరు) మండలంలోని రెండు క్వారీలు, వాజేడు మండలంలో మూడు క్వారీలు కొనసాగుతున్నాయి. కొందరు ఇసుకను డంప్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తూ ట్రాక్టర్ ఇసుకను రూ.4వేల నుంచి రూ.7వేల వరకు విక్రయిస్తున్నారు. క్వారీల సంఖ్య తగ్గడంతో ఆన్‌లైన్‌లో డీడీలు కూడా రావడం లేదని లారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆ క్వారీ ఎందుకు మూసేశారు?

కాళేశ్వరం ఏరియాలోని పలుగుల (విలాసాగర్ 3) క్వారీని ఎందుకు కొనసాగించడం లేదని లారీ యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ నాణ్యమైన ఇసుక ఉందని, కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ఈ క్వారీని కావాలనే మూసేశారని ఆరోపిస్తున్నారు. ఓ అధికారి కాళేశ్వరం ఏరియాలోని క్వారీలపై ఆధిపత్యం చెలాయిస్తూ ఇసుక కృత్రిమ కొరత సృష్టిస్తున్నాడని, ఆయన కనుసన్నల్లోనే అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోందని లారీ యజమానులు బహిరంగంగానే చెబుతున్నారు. క్వారీల్లోకి బుకింగ్‌తో వచ్చిన ప్రతి లారీ నుంచి రూ.1000 చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, ఇలా రోజుకు సుమారు 350 లారీలు రవాణా అవుతుంటే మొత్తం రూ.3.5లక్షలు వసూలు చేస్తున్నారని అంటున్నారు. అక్రమ దందాలో ఆ అధికారిదే ప్రధాన భూమిక అని ఆరోపిస్తున్నారు. అతనిపై హైదరాబాద్‌లోని ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు.



### కృత్రిమ కొరతతో పరేషాన్

కొన్ని క్వారీలు మూతపడడంతో ములుగు, పస్రా, గోవిందరావుపేట, మల్లంపల్లిలో వ్యాపారులు ఇసుకను డంప్ చేసుకొని కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయిస్తుండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో వినియోగదారులే స్వయంగా ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకొని ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేక వ్యాపారుల వద్ద అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# చెల్లింపుల్లో అదే నిర్లక్ష్యం

- **ఖాతాదారులను ఇబ్బంది పెడుతున్న చిట్‌ఫండ్ సంస్థలు**
- **సీపీకి మొరపెట్టుకుంటున్న బాధితులు**
- **'కనుకదుర్గ' మాజీ ఉద్యోగి ఆత్మహత్య ఘటనపై సీపీ ఆరా**

సుబేదారి, ఫిబ్రవరి 6 : నగరంలోని చిట్‌ఫండ్ సంస్థల యాజమాన్యాల ఆగడాలు శృతిమించుతున్నాయి. ఖాతాదారులకు డబ్బులు చెల్లించకుండా మొండిగా వ్యహరిస్తున్నారు. చిట్టీ గడువు ముగిసి నెలలు, ఏళ్లు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదు. ప్రధానంగా అక్షర, శుభనందిని, కనకదుర్గ, భవితశ్రీ, అచల చిట్‌ఫండ్ సంస్థల యాజమాన్యాలు ఏడాదిగా ఖాతాదారులకు డబ్బులు చెల్లించకవడంతో బాధితులు న్యాయం కోసం పోలీసు కమిషనరేట్ బాటపట్టారు. సీపీ అంబర్ కిశోర్ ఝాకు మొరపెట్టుకుంటున్నారు. అక్షర చిట్‌ఫండ్ నుంచి సుమారు 140 మంది, శుభనందిని 30, కనకదుర్గ 70, భవితశ్రీ నుంచి 40కి పైగా బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ జనవరి 4న చిట్‌ఫండ్ సంస్థల యజమానులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, బాధితులతో సమావేశమయ్యారు.



సుమారు 300పైగా బాధితులకు ఈ నాలుగు సంస్థలు రూ.4.50కోట్లు చెల్లించాలని తేలింది. ఈ డబ్బులను మూడు విడుతల్లో చెల్లించాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు. సమావేశం తర్వాత ఈ నెల రోజుల్లో రూ.68 లక్షలు మాత్రమే చెల్లించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. చిట్‌ఫండ్ సంస్థల ధోరణితో బాధితులు ఆ సంస్థల్లో పనిచేస్తున్న ఏజెంట్లు, ఉద్యోగులను డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో కనకదుర్గ చిట్‌ఫండ్ సంస్థ మాజీ ఉద్యోగి భాస్కర్‌రెడ్డి ఆత్మహత్యతో చిట్‌ఫండ్ సంస్థల భాగోతం మరోసారి బయటపడింది. ఈ ఘటనపై సీపీ ఆరా తీశారు. మేనేజ్‌మెంట్ ధోరణితోనే భాస్కర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి కుటుంబ సభ్యులు సుబేదారి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే భాస్కర్‌రెడ్డి సూసైడ్‌నోట్ ఆధారంగా పోలీసులు కనకదుర్గ మాజీ ఎండీ తిరుపతిరెడ్డి, ప్రస్తుత ఎండీ కరుణాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. తిరుపతిరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా, భాస్కర్‌రెడ్డి కుటుంబానికి ఆలేరు వెంచర్‌లో ప్లాట్, ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిసింది. అలాగే ఖాతాదారులకు డబ్బుల చెల్లింపు విషయంలో ఆయా చిట్‌ఫండ్ సంస్థల మేనేజ్‌మెంట్లతో ఒకటి, రెండు రోజుల్లో సీపీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

# విద్యార్థి స్కూల్ బ్యాగులో తాచుపాము

### నెక్కొండలో ఘటన

నెక్కొండ, ఫిబ్రవరి 6 : పాఠశాలకు వెళ్తున్న ఓ విద్యార్థి స్కూల్ బ్యాగులో నుంచి తాచుపాము బయటపడడంతో విద్యార్థులంతా బెంబేలెత్తిపోయారు. ఈ సంఘటన మంగళవారం వరంగల్ జిల్లా నెక్కొండలో చోటుచేసుకుంది. విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండకు చెందిన ఈదునూరి విజేందర్–మమత కుమారుడు వివేక్ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే వివేక్ తోటి విద్యార్థులతో కలిసి పాఠశాలకు వెళ్తుండగా బ్యాగులోంచి తాచుపాము బయటకు వచ్చింది. వివేక్ వెనుక నడుస్తున్న తోటి విద్యార్థులు పాము పాము అని గట్టిగా అరవడం, ఇంతలో అది రోడ్డుపై వెళ్లిపోయింది. అయితే వివేక్ ఇంట్లోకి సోమవారం పాము వచ్చిందని, ఎంత వెతికినా ఇంట్లో దొరకలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. అదే పాము స్కూల్ బ్యాగులోకి చేరి ఉంటుందని భావించారు. మొత్తానికి పాముతో ఎలాంటి హాని జరుగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



స్కూల్ బ్యాగు భుజానికి వేసుకొని ఉన్న విద్యార్థి వివేక్

## కొడుకు, తల్లి ఆత్మహత్య కేసులో ఏడుగురి అరెస్ట్

ఖిలావరంగల్, ఫిబ్రవరి 6 : అదనపు కట్నం కోసం వేధింపులు తట్టుకోలేక ఓ మహిళ ఏడు నెలల కుమారుడితోపాటు చెరువులో దూకి ఆత్మహత్మ చేసుకున్న కేసులో మృతురాలి కుటుంబ సభ్యులైన ఏడుగురిని మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. 2022, అక్టోబర్ 14వ తేదీన తస్లీమ్(23), మోమిన్‌పురానికి చెందిన ఎండీ తన్వీర్‌కు కరీంనగర్‌లో వివాహమైంది. రూ.1.50లక్షల నగదు, మూడు తులాల బంగారం, 26 తులాల వెండి కట్నంగా ఇచ్చారు. షాదీముబారక్ చెక్ వచ్చాక బైక్ కోసం రూ.లక్ష ఇచ్చారు. అదనంగా రూ.26వేలు తీసుకురావాలని ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించారు. దీంతో ఆమె జీవితంపై విరక్తి చెంది ఈ నెల 1న సాయంత్రం 4గంటలకు ఇంట్లో నుంచి కుమారుడు థైమూర్(ఏడు నెలలు)ను తీసుకొని అన్నారం షరీఫ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కాగా, మృతురాలి తల్లి ఫాతిమా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతురాలి భర్త తన్వీనర్, అత్త అఫ్జల్‌బీ, మామ మహమూద్, ఆడబిడ్డ తస్లీం, బావ ఫారూఖ్, తోటికోడలు షాజహ, ఆడబిడ్డ భర్త జాఫర్‌ను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

## జంపన్నవాగులో యువకుడి గల్లంతు

తాడ్వాయి, ఫిబ్రవరి 6 : సమ్మక్క–సారలమ్మ దర్శనానికి వచ్చిన స్వాగత్(23) జంపన్న వాగులో గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన స్వాగత్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మేడారం వచ్చాడు. దర్శనం అనంతరం జంపన్నవాగు ప్రాంతంలో విడిది చేశారు. బంధువుల పిల్లలతో కలిసి స్వాగత్ కొత్తూరు లోలెవల్ కాజ్‌వే సమీప పాలమడుగుకు వద్ద జంపన్నవాగులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. లోతు తెలియక మునిగిపోయాడు. తోటి పిల్లలు బంధువులకు పస్రా సీఐ శంకర్‌కు సమాచారం ఇచ్చారు. రెస్క్యూ టీమ్ గాలిస్తున్నా ఆచూకీ దొరకలేదు.

## ముగ్గురు నకిలీ విలేకరుల అరెస్ట్

నల్లబెల్లి, ఫిబ్రవరి 6: ఈజీ మనీ కోసం విలేకరులమంటూ బెదిరిస్తున్న ముగ్గురు నకిలీ విలేకరులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్సై నైనాల నగేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన టింగిలికార్ సతీష్, వడ్డెపెల్లి రాజు, వెల్ది రాజేందర్ 24న్యూస్ చానల్ విలేకరులమంటూ పలువురిని బెదిరింపులకు పాల్పడుతున్నారు. మండలంలోని మేర్గు శ్యామ్ పద్మాపురం శివారులోని గువ్వల బోడు వద్ద జేసీబీతో మట్టి తవ్వి తరలిస్తుండగా సతీష్‌కుమార్‌తోపాటు మరో ముగ్గురు వచ్చి 24 న్యూస్ యూ ట్యూబ్ చానల్ విలేకరులమంటూ బెదిరించి, రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో భయాందోళనకు గురైన శ్యామ్ నకిలీ విలేకరి సతీష్‌కు రూ.5 వేలు ఫోన్ పే చేశాడు. వారిపై అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ముగ్గురిని అరెస్టు చేసి విచారించారు. వారి నుంచి ఆటో, ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.